భార్యను భరించలేక హత్య చేద్దామని అతను వేసిన పథకం ఫలించిందా?

నాకల సీతారామరావ్ కథ

# లవర్స్ పాయింట్

ఈ విశాల భూ ప్రపంచంలో ప్రతివాడికీ తగిన సహధర్మచారిణి దొరకడం ఓ విధంగా చాలా కష్టమే. తన మొత్తం జీవితకాలంలో కొన్ని వందల మందిని మాత్రమే కలుస్తాడు. ఆ కొద్ది వందల్లో ఏ కొద్ది డజన్ల మందితో మాత్రమే అతను కొంచెం సన్నిహితంగా వుంటాడు. ఆ డజన్లలో బహుశా ఒక్కరో, ఇద్దరో అతని మనసుకు తగ్గవాళ్లుంటారు. అందుకే విడాకుల చట్టాలూ, అక్రమ సంబంధాలు వగైరా, వగైరాలు...

అందుకే కాబోలు ఓ ప్రముఖ ఆంగ్లకవి— "మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్" అన్నాడు.

పెళ్లి అనబడే 'బంధం' తర్వాత నూటికి తొంభైపాళ్లు జంటలు వైరుధ్యమైన తమ స్వభావాల్తో భార్యాభర్తలుగా ఓ 'కాంప్రమైజ్' జీవితమే గడుపుతూ వుంటారు. అందులో ఇద్దరి మనస్తత్వాలూ నార్త్‌పోల్, సౌత్‌పోల్లా వుంటే భయంకర పరిస్థితుల నెదుర్కోవడం తథ్యం.

సరిగ్గా ఈ కోవకి చెందిన జంటే భాస్కర్, దేవికలు.

బాగా వున్నత కుటుంబంలోంచి వచ్చిన వాళ్లు.

జీవితం అన్ని విషయాల్లోనూ ఓ వడ్డించిన విస్తరే.

ఒక్క పెళ్ళి విషయంలో తప్ప.

అదో శాపంలా మిగిలిపోయింది వాళ్ళిద్దరికీ.

"వైరుధ్య మనస్తత్వం, మా ఇద్దరిది.



మాకు పొందు కుదరటం లేదు''– అంటే చట్టంలో విడాకులు మంజూరు చేయడానికి వీల్లేదు కాబట్టి విధిలేక రోజులు గడుపుతున్నారు వాళ్లిద్దరూ.

దినదినానికి వాళ్ళిద్దరిలో ఒకరిపై ఒకరికి అసహ్యం పెరిగి చివరికది కసిగా పగగా తయారైంది. అదే ఏ కూలీ నాలో చేసుకునే జంటైతే బహుశా భాస్కర్ దేవికని ఏనాడో

వదిలేసేవాడు. కానీ అప్పర్ క్లాస్‌కి చెందిన భాస్కర్‌లోని 'స్టేటస్' అడ్డొస్తోంది అలాంటి పనికి.

రానురాను వాళ్ళిద్దరూ కలిసి మెలిసుండటం కష్టమయింది.

ఓ రోజు భాస్కర్ కృతనిశ్చయుడయ్యేడు దేవిక నంతం చేయాలని.

ఆ హత్య బాహ్య ప్రపంచానికో ఏక్సిడెంట్‌గా కనబడేట్టు ప్లాన్ తయారుచేసాడు.

అయితే టక్కరి మనసున్న మనిషి ప్లాన్ ఎంత పకడ్బందీగా చేసినా, ఎక్కడో ఓ లొసుగుంటుంది.

... ...

ఓ రోజు ప్రొద్దున్నే బెడ్ 'టీ' సిప్ చేస్తూ దేవికకి చెప్పేడు భాస్కర్— తను వచ్చేనెలంతా ఊటీలో గడుపుదామను కుంటున్నానని.

దేవిక తనూ వస్తానంది. అలా అంటుంది అని భాస్కర్‌కీ తెలుసు.

ఈ మధ్య తనెక్కడికి వెళ్తానన్నా తనూ వస్తానంటోంది దేవిక.

ఓ సుముహూర్తాన ఆ జంట ఊటీ చేరుకున్నారు. వాళ్ల బస 'హోటల్ హిల్ ప్యాలెస్'లో.

ఆ హోటల్ రెండు కొండ చరియల మధ్యగా వుంది. అక్కడికి చేరుకోవాలంటే ఎగుడు దిగుడులున్న ఓ ఆరు కిలోమీటర్ల రోడ్డు ప్రయాణం చేయాల్సుంటుంది.

ఆ హోటల్ ప్రక్క అగాధలోయలమయం.

అప్పటికి ఎన్నిసార్లో ఆ హోటల్లో బసచేసిన భాస్కర్‌కి ఆ పరిసరాల 'టోపోగ్రఫీ' బాగా తెలుసు.

అయితే ఇప్పుడతను ఊటీ రావడంలో ఓ ప్రత్యేకమైన ఉద్దేశ్యముంది కాబట్టి అతని మనసులో ఆ హోటల్‌కి రెండు కిలోమీటర్ల దూరంలో వున్న 'లవర్స్ పాయింట్' మెదుల్తోంది.

ఆ 'లవర్స్ పాయింట్' పై నుల్చుంటే ఊటీ అంతా కనబడ్తుంది. కానీ తనెవ్వరికీ కనబడదు. అదే ఆ కొండ చరియ ప్రత్యేకత.

ఓ రోజు తెల్లవారురాఝమున దేవిక గాఢ నిద్రలో వున్నప్పుడు తనెళ్ళి ఆ ప్రదేశాన్ని పూర్తిగా సర్వే చేసొచ్చేడు.

అక్కడికి చేరుకున్న భాస్కర్ క్రిందికి చూస్తే కళ్ళు తిరిగేయ్. ఒళ్ళు వణికింది. ఆ కొండపైనుండి లోతు ఓ కిలోమీటరుంటుంది. క్రింద రాళ్ళూ రప్పలూ— ముళ్ళ పొదలు తప్ప మరేంలేవు.

భాస్కర్ నిశ్చయించుకున్నాడు. తన ప్లాన్ అమలు పర్చే ప్రదేశం 'లవర్స్ పాయింట్'. దాని ముహూర్తం రేపు వుదయం.

మర్నాడు టిఫిన్ చేస్తూ భాస్కర్ మాట కదిపేడు దేవికతో జాగ్రత్తగా. 'నేనలా లవర్స్ పాయింట్‌కేసి నడిచి పోదల్చుకున్నా నువ్వొస్తావా?' అని

''ఊ'' అంది దేవిక కాఫీ సిప్ చేస్తూ.

మరో అరగంలో ఆ జంట బయల్దేరేరు లవర్స్ పాయింట్ కేసి.

బయటికొస్తున్న వాళ్ళిద్దర్నీ ఆ హోటల్ మేనేజర్ ఆసక్తిగా చూడ్డం గ్రహించేడు భాస్కర్. తాము ఇక్కడికొచ్చే అందరి జంటల్లా కాదని తెలీదు పాపం అనుకున్నాడు.

దారిలో ఒకరితో మరొకరు మాట్లాడుకోలేదు. ముభావంగా కొండల్నీ, గుట్టల్నీ చూస్తూ నడుస్తున్నారు.

లవర్స్ పాయింట్ దాదాపు చేరేరిద్దరూ.

భాస్కర్ మనసులోని ప్లాన్‌కి ఓ నిర్దిష్టమైన పథకమంటూ లేదు. పరిస్థితుల్ని బట్టి అమలు చేద్దామనుకున్నాడు.

ఒక్కోసారి ఓ వింత భయం భాస్కర్ని ఆవరిస్తోంది. తను లవర్స్ పాయింట్ నుండి దేవికని తోసేసినప్పుడు తనమెక్కడ గట్టిగా పట్టుకుని తనతోబాటు లాగేస్తుందేమో అని.

దేవికకేమైనా ఈ జరగబోయే వుపద్రవం గురించి ప్రిమానిషన్ వస్తుందా అని.

దారి పొడుగునా తను ఒక్క మాటైనా మాట్లాడకుండా ఎందుకున్నాడంటే తను భయంతో జీర గొంతుతో మాట్లాడుతే దేవికకేమైనా అనుమానం రావచ్చు తన ప్లాన్ గురించి అని.

తన ప్లాన్ త్వరితంగా సడెన్‌గా జరగాలి. దాంతో దేవికకి తప్పించుకోవడానికి ఛాన్సెస్ 'నిల్'.

భాస్కర్ ఆలోచిస్తున్నాడు.

నుదుటపడ్డ చెమటని దేవిక చూడకుండా తుడుచుకోడానికి ప్రయత్నిస్తున్నాడు.

లవర్స్ పాయింట్ చేరుకోగానే దేవిక ఒక్కసారి ఒళ్ళు విరుచుకుంది. భాస్కర్ వైపే చూస్తూ.

"ఏంటి దేవీ— అలసిపోయావా?" అన్నాడు భాస్కర్.

దానికి జవాబుగా— 'భాస్కర్' అంది దేవిక.

జీవితంలో మొదటిసారి భర్తనలా పేరుపెట్టి పిల్చింది దేవిక.

"నువ్వే కనక నాతో కొంచెం మంచిగా వుంటే ఇపుడు మన జీవితమిలా వుండేది కాదు ఏమంటావ్" అంది.

'ఆ ప్రశ్న ఇపుడు అప్రస్తుతం' అన్నాడు భాస్కర్.

నాకెంతో బాధగా వుంది. మరి నీకు?—

## అల్లం వైద్యం



అల్లం ఆయుర్వేద వైద్యంలో ఎంతో ప్రాముఖ్యత కల్గిన అద్భుత పదార్థం! ప్రపంచ ఉత్పత్తిలో 50 శాతం అల్లం మనదేశంలోనే ఉత్పత్తి అవుతోంది. మనదేశ ఉత్పత్తిని పరిశీలిస్తే... 70 శాతం ఉత్పత్తి కేరళలోనే అవుతోంది. అంతేకాదు! మనదేశం నుండి అల్లంను 50 దేశాలకు ఎగుమతి చేస్తున్నాం! అనేక తినుబండారాలలోనూ, పచ్చళ్ళలోను అల్లంను ప్రపంచ ప్రజలంతా వాడుకొంటారు. దగ్గు, జలుబు, అజీర్ణం వంటి ఎన్నో వ్యాధుల్ని తగ్గించటానికి అల్లం ఉపయోగపడ్తుంది! శొంఠి తయారీకి కూడా అల్లంను వాడ్తారు!

—జూపిటర్.

అంది దేవిక.

'నాకేం లేదు' అన్నాడు

'నాకు తెలుసు. అయినా వూరికే అడిగేను. అంతే'— అంది దేవిక.

'ఊరికేనా? దేవికి? నేను నీ నుండి ఆశించిందేమీలేదు. ఓ మగాడు తను ద్వేషించే ఆడదాని దగ్గర్నుండి ఏమీ కోరుకోడు. భార్యా భర్తలవడం మన ఖర్మ. నా జీవితంలో పూర్తిగా మనశ్శాంతి లేకుండా చేసేవ్ నువ్వు. 'ఐ హేట్ యూ బిచ్ అన్నాడు కోపంగా.

''నేనూ నిన్ను హేట్ చేస్తున్నా''— అంది దేవిక నెమ్మదిగా లవర్స్ పాయింట్ క్రింద అగాధానికేసి చూస్తూ.

అపుడు వాళ్ళిద్దరూ లవర్స్‌పాయింట్ చివరి మొనన నిల్చున్నారు.

ముందు దేవిక.

రెండడుగుల వెనక భాస్కర్.

దేవిక అటూ ఇటూ పచార్లు చేస్తోంది అక్కడికక్కడే.

''ఎందుకలా పిచ్చి కుక్కలా అటూ ఇటూ తిరుగుతున్నావ్? ఒక్కచోట నిలబడలేవా?'' అన్నాడు భాస్కర్ కోపంగా.

''అవును— నేనో పిచ్చి కుక్కనే. నువ్వో క్షణం క్రితం నన్నెంతగా హేట్ చేస్తున్నావో చెప్పావ్. కాని— నువ్వో మగాడివి. ఓ మగాడి పగ ఆడదాని పగ ముందర నథింగ్. మీకు పగ వుంటుందే కానీ పకడ్బందీ ప్లానుండదు. మేం అలాకాదు. నువ్వు నన్నెంత హేట్ చేసినా నన్ను హాశమార్చలేవు. అయితే నేనలా కాదు. నా కోర్కె వేరు. నేను నిన్నెంతగా ద్వేషిస్తున్నానో ఇపుడే చూపిస్తా''— అంది దేవిక వెర్రిగా వూగిపోతూ.

భాస్కర్ పిచ్చిగా చూస్తున్నాడు.

'అయితే నేనిక్కడకొచ్చే ముందు మా ఫ్రెండ్సందరికీ చెప్పేను— నువ్వు నన్ను చంపదల్చుకున్నావనీ.'

''దేవికా! ఏమిటి నువ్వంటోంది?—'' పిచ్చిగా అరిచేడు భాస్కర్.

''నువ్వంటే నా కసహ్యం. నీపై పగ సాధిద్దామనే నేనలా చెప్పేనందరికీ. అంతేకాదు. ఇపుడు మనమున్న హోటల్ మేనేజర్‌కి కూడా చెప్పేనీవిషయం. అందుకోసం ఓ ఇద్దరు మఫ్టీలో వున్న పోలీసులు మన వెంట పంపమని చెప్పేను. వాళ్ళిద్దరూ ఇప్పుడు మనిద్దర్నీ పొంచి చూస్తున్నారెక్కడి నుంచో.

చెప్పుకో వాళ్ళకి. నిన్ను వాళ్లసలు నమ్మగల్గితే— ఇది "ఏక్సిడెంట్ మాత్రమే" అని/మరో తృటిలో దేవిక తన చీరనీ, జాకెట్‌నీ చింపేసుకుంది.

''ఏమిటీ నువ్వు చేస్తున్న పని?'' అని భాస్కర్ ఒక్క వుదుటున దేవికని చేరబోయేడు. కానీ అంతలోకే దేవిక లవర్స్‌పాయింట్ మొనపైనుండి అగాధంలోకి అడుగు పెట్టింది.

మరోక్షణంలో ఓ ఇద్దరు వ్యక్తులు ప్రక్కనేవున్న పొదలోంచి బయటకొచ్చేరు.

అపుడర్థమైంది భాస్కర్‌కి తనెంత నెత్తీనోరూ బాదుకున్నా తన మాట వాళ్లు వినరనీ, నమ్మరనీ.

❀